www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 12 సెప్టెంబర్ 2025
5
వైఎస్ఆర్



ఎమ్మెల్యే కృషి అభినందనీయం

ప్రజాశక్తి- కడప అర్బన్ : జిల్లాలో మైనార్టీల సమస్యల పరిష్కారంలో కడప నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి కృషి అభినందనీయమని రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎం.ఎ. షరీఫ్ అన్నారు. గురువారం కడప పర్యటించారు. జనవరిలో నిర్వహించనున్న తబ్లిగ్ జమాత్ దీని ఇజ్తెమా నిర్వాహ కులతో కలిసి శ్రీనివాసరెడ్డిని కలిశారు. 30 సంవత్సరాలుగా పరిష్కారం కాని మురాదియా పీరంపంశస్తులను ఏకం చేయడం, ఏడు రోడ్ల కూడలి మసీదు నిర్మాణం కోసం అవసరమైన షాప్ రూమ్ ల నిర్మాణానికి పూర్తిగా సహకారాలు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని అబూ హురైరా మసీదుకు సంబంధించి విలువైన వక్ఫ్ స్థలాన్ని కబ్జాదారుల నుంచి రక్షించడం లాంటి అనేక కార్యక్రమాల వల్ల స్థానిక మైనారిటీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులతో కలిసి ఇజతెమా నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు.

స్టాఫ్‌నర్స్ ప్రమోషన్ల కోలాహలం

60 స్టాఫ్‌నర్సు పోస్టులకు 50 భర్తీ
గైర్హాజరీల పరిస్థితిపై గందరగోళం?



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో స్టాఫ్‌నర్స్ పోస్టుల కోలాహలం నెలకొంది. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని జోన్–4 కేటగిరి పరిధిలో 397 పిహెచ్‌సిలు ఉన్నాయి. వీటిలో తరచుగా స్టాఫ్‌నర్స్ పోస్టులకు ఖాళీలు ఏర్పడ తన్న సంగతి తెలిసిందే. ఆర్జీ కార్యాలయం ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఆదేశాల మేరకు రిక్రూట్‌మెంట్ చేస్తోంది. స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. 12 వేల మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. సీనియారిటీ ఆధారంగా గురువారం జిల్లా రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో 68 స్టాఫ్‌నర్స్ పోస్టుల రిక్రూట్‌మెంట్‌కు అభ్యర్థులను ఆహ్వానించారు. 50 మంది రిక్రూట్‌మెంట్‌కు హాజరయ్యారు. ఆర్‌డి కార్యాలయ యంత్రాంగం అర్హత కలిగిన అభ్యర్థులకు స్టాఫ్‌నర్స్‌లుగా పోస్టింగ్స్ ఇచ్చింది. స్టాఫ్‌నర్స్ రిక్రూట్‌మెంట్‌కు గైర్హాజరైన 18 మంది భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్ రిక్రూట్‌మెంట్‌లో 68 మంది జాబితా ఎగువన ఉన్న వారిని మాత్రమే పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రిక్రూట్‌మెంట్ సమయంలో వివిధ అనివార్య కారణాల వల్ల గైర్హాజరైన 18 మందికి మరోసారి అవకాశం లభించని పరిస్థితి ఏర్పడింది. దీనిపై రీజినల్ డైరెక్టర్ రామగిడ్డయ్యను సంప్రదించగా రిక్రూట్‌మెంట్ నిబంధనల ప్రకారం గైహాజరైన అభ్యర్థులను మరో సారి పిలవడానికి అవకాశం లేదని తెలిపారు. అటువంటి వారిలో అత్యధికులు పలు పిహెచ్‌సిల్లో విధులు నిర్వహించేవారే ఎక్కువగా ఉన్నారని పేర్కొనడం గమనార్హం.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పాత పెన్షన్ పునరుద్ధరించాలని జిల్లా కన్వీనర్ గుజ్జల తిరుపాల్, డిఎస్‌సి- 2003 ఉపాధ్యాయుల ఫోరం, ఆంధ్రప్రదేశ్ పిలుపుమేరకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 అనుసరించి 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు (7361మంది), పోలీసులు (1821), గ్రూప్ 1 -గ్రూప్ 2 ఉద్యోగులకు (1800) పాత పెన్షన్ సాధనకై కడప తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్లు గుజ్జల తిరుపాల్, శోభారాణి మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ పునరుద్ధరించాలని పేర్కొన్నారు. ఐదేళ్లుగా ప్రభుత్వ పెద్దలకు అనేక ప్రాతినిధ్యాలు చేశారని తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటివరకు దేశంలో మెమో 57 ప్రకారం 16 రాష్ట్రాల్లో పాత పెన్షన్ పునరుద్ధరించారని తెలిపారు. అక్షర క్రమంలో ముందు ఉన్న ఆంధ్రప్రదేశ్ మాత్రం పాత పెన్షన్ అమలు కై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్లు గుజ్జల తిరుపాల్, బసిరెడ్డి శోభారాణి, నియోజక వర్గ బాధ్యులు బి. గంగాధర్, ఎస్. బాబూరెడ్డి, పి.వెంకటసుబ్బారెడ్డి, చెన్నయ్య, రోజరాణి, చంద్రకళ, కడప ప్రాంతంలోని 2003 డిఎస్‌పి ఉపాధ్యాయులు, ఎన్‌జిఒ సంఘం నగర అధ్యక్షులు కె. చెన్నయ్య, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మీరాజా, పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరి వెంకట శివారెడ్డి, పిఎస్‌టియు జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి, ఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రామాంజినేయులు. రామిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ప్రతాపుడు, ఎన్. లక్ష్మీకాంత్, ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రతినిధులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



యూరియా కోసం క్యూకట్టిన రైతన్నలు

యూరియా కోసం తప్పని తిప్పలు
ప్రయివేట్ దుకాణాల ముందు రైతుల క్యూ

ప్రజాశక్తి - చాపాడు

రోజులు గడుస్తున్నా యూరియా కోసం రైతులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. పలానా దుకాణంలో యూరియా అందుబాటులో ఉందంటే పనులన్నీ వదులుకొని దుకాణం ముందు పడి గాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గత సోమవారం రోజు మండల కేంద్రంలో 400 బస్తాలు, చిన్న గురవలూరు రైతు సేవా కేంద్రంలో 400 బస్తాలు పంపిణీ చేశారు. మంగళ, బుధవారాల్లో యూరియా ఎక్కడ అందుబాటులో లేదు. గురువారం మండల కేంద్రంలోని రెండు ప్రవేటు దుకాణాలకు 500 బస్తాల యూరియా అందుబాటులో ఉందని సమాచారం అందుకున్న రైతులు క్యూ కట్టారు. రైతు సేవ కేంద్రాల్లో యూరియా అందుబాటులో లేదు. అధికారులు మాత్రం రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉంచుతామని ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతున్నారు. ఒక్కొక్క రైతుకు కేవలం ఒకటి, రెండు బస్తాలు మాత్రమే యూరియా పంపిణీ చేస్తుండటంతో ఎక్కువ ఎకరాలలో వరి పంటను సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అన్ని రైతు సేవా కేంద్రాల్లో అవసరం మేరకు యూరియాను అందుబాటులో ఉంచాలని రైతుల కోరుతున్నారు.

శిక్షణతో విద్యార్థుల ప్రగతికి నాంది

ప్రజాశక్తి - కడప అర్బన్

నెల రోజుల శిక్షణతో విద్యార్థుల కెరీర్ ప్రగతికి నాంది అని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ఆచార్య టి.శ్రీనివాస్ అన్నారు. గురువారం యోగి వేమన విశ్వవిద్యాలయం మాస్టర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ శాఖ ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ సహకారంతో ఎంబిఎ విద్యార్థుల కోసం 30 రోజుల 'యుఎన్‌ఎక్స్‌ట ఉన్నతి కార్యక్రమాన్ని కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయంలో గురువారం ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉపాధి వృత్తిపరమైన నైపుణ్యాలను సమగ్రంగా పెంపొందించే లక్ష్యంతో 30 రోజుల ఇంటెన్సివ్ ప్రయాణానికి నాంది పలికిందన్నారు. విద్యాభ్యాసం, పరిశ్రమ అవసరాల మధ్య అంతరాన్ని తగ్గించాలన్న లక్ష్యంతో కార్యక్రమాన్ని రూపొందించారని తెలిపారు. ఇది విద్యార్థుల కెరీర్ అభివృద్ధిలో గణనీయంగా ప్రయోజనం చేకూరుస్తుంది. ఈ విలువైన కార్యక్రమాన్ని ప్రారంభించినందుకు బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ పి. సరితను ప్రశంసించారు. ఈ సందర్భంగా డాక్టర్ సరిత మాట్లాడుతూ ఆధునిక కార్పొరేట్ ప్రపంచంలో సాఫ్ట్ స్కిల్స్ అత్యంత కీలకమని నొక్కిచెప్పారు. ఈ చొరవ విద్యార్థుల వ్యక్తిత్వాలు, కమ్యూనికేషన్ సామర్థ్యాలు, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థుల ప్రయోజనమే పరమావధిగా ఎంబిఎ శాఖ పనిచేస్తోందన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఎంబిఎ శాఖ ఎపిఎస్‌డిసి మధ్య ఈ భాగస్వామ్యం విద్యార్థుల భవిష్యత్ కెరీర్‌లలో రాణించడానికి అవసరమైన సాధనాలు, సామర్థ్యాలతో సాధికారత కల్పించడానికి ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎపిఎస్ఎస్‌డిసి శిక్షణ నిపుణులు నరసింహులు, కళ్యాణి, ఎంబిఎ విద్యార్థులు వ్యాపార నిర్వహణ విభాగం అధ్యాపకులు హాజరయ్యారు,

వినియోగంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- కడప సిటీ

యూరియా వినియోగంపై రైతులకు అవగాహన రైతులకు అవసరమని కడప సహాయ వ్యవసాయ సహాయ సంచాలకులు బి. శ్రీదేవి పేర్కొన్నారు. బుధవారం కడప వ్యవసాయ డివిజన్ పరిధిలోని వ్యవసాయ శాఖ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా వినియోగం పట్ల అవగాహన కొరవడిన కారణంగానే సమస్య ఏర్పడినట్లు తెలిపారు అనంతరం ఖాజీపేట, ఒంటిమిట్ట, పెండ్లిమర్రి, కడప చింతకొమ్మదిన్నె, కడప, మండలాల వ్యవసాయశాఖ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు రైతు భరోసా కేంద్రాలలో యూరియా రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. యూరియా వాడకం పైన రైతులకు అవగాహన పెంచాలని తెలిపారు. ఎకరాకు 75 కిలోల యూరియా వరి పైరుకు సరిపోతుందని రైతులకు తెలియజేయాలని పేర్కొన్నారు. పంట వేసిన ప్రతి రైతూ ఇ-పంట నమోదు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ఈశ్వర్ రెడ్డి, సురేష్ కుమార్ రెడ్డి, సుమంత్ రెడ్డి,నాగార్జున, శ్రీదేవి, మంజుల, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ సంచాలకులు శ్రీదేవి

సీతారాం ఏచూరి జీవితం నేటి తరానికి ఆదర్శం


ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

సీతారాం ఏచూరి జీవితం నేటి తరానికి ఆదర్శమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ కడప రామకృష్ణ నగర్‌లో నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బి.దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ కార్మిక వర్గ పక్షపాతి, పీడిత ప్రజల ప్రియతమ నేత సీతారాం ఏచూరి అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం దేశవ్యాప్తంగా అనేక ఆందోళన, పోరాటాలు నిర్వహించిన గొప్ప వ్యక్తి అని తెలిపారు. మతతత్వం, నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా ఏచూరి క్రమం తప్పకుండా పార్లమెంటులో జోక్యం చేసుకునే వారిని పేర్కొన్నారు. దేశంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు జైలుకు కూడా వెళ్లారని చెప్పారు. దేశంలో వామపక్ష మేధావాల్లో సీతారాం ఏచూరి ఒకరని తెలిపారు. ఇవాళ మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని చెప్పారు. ఉత్తమ పార్లమెంటీరియన్ నేత అని, జాతీయస్థాయిలో సుందరయ్య తర్వాత రెండో వ్యక్తి సీతారాం ఏచూరి అని పేర్కొన్నారు. విద్యార్థుల బోధన రీసెర్చ్ కోసం ఏచూరి పార్థీవదేహాన్ని ఎయిమ్స్ మెడికల్ హాస్పిటల్‌కు వారి కుటుంబ సభ్యులు అప్పగించారని చెప్పారు. పీడిత, అణగారిన వర్గాల ప్రజల కోసం అనునిత్యం పోరాడిన గొప్ప మహనీయుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోయేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, కెవిపిఎస్ నగర కన్వీనర్ నరసింహ, జిల్లా ఉపాధ్యక్షులు జార్జి మహిళా సంఘం నాయకురాలు కామేశ్వరమ్మ, సిఐటియు నాయకులు గోవిందు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, నగర కన్వీనర్ సి.పి.రమణ పాల్గొన్నారు.


తలపడుతున్న నెల్లూరు, చిత్తూరు జట్లు

కొనసాగుతున్న క్రికెట్ మ్యాచ్‌లు
- భారీ స్కోరు దిశగా నెల్లూరు జట్టు

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్- 23 మల్టీ డే క్రికెట్ టోర్నీలో భాగంగా గురువారం వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నెల్లూరు, చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 75.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 407 పరుగుల భారీ స్కోరు దిశగా ప్రయాణిస్తుంది. ఆ జట్టులోని రోషన్ పవన్ కుమార్ బ్యాటింగ్ అద్భుతంగా ప్రదర్శించి 226 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. సుతేజ్ రెడ్డి 89 (నాట్ అవుట్) పరుగులు చేశారు. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభమైన వేరొక మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో 57.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. ఆ జట్టులోని నయీముల్లా 107 (సెంచరీ) పరుగులు చేశాడు. సాయి గణేష్ 57 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతపురం జట్టులోని షేక్ కామిల్ రెండు వికెట్లు తీసుకున్నాడు.

జగన్‌పై రాజ ద్రోహం కేసు నమోదు చేయాలి
- టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులను నోటికి వచ్చినట్లు మాట్లాడిన జగన్మోహన్ రెడ్డిపై రాజ ద్రోహం కేసు నమోదు చేయాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస్ రెడ్డి కోరారు. గురువారం ద్వారకా నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. టెండర్లు వేస్తే రద్దు చేస్తామని భయా ఎట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధిని జగన్ అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వ నిర్ణయాలను అంగీక రించాలని తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే కోర్టుకు వెళ్ళవచ్చని చెప్పారు. ఇలా వార్నింగులు ఇవ్వటమేమిటని ప్రశ్నించారు. వైసిపి ఫేక్ వీడి యోలతో రాష్ట్ర అభివృద్ధిని వెనక్కు నెట్టేస్తుందని చెప్పారు. పెట్టుబడిదారులను బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా జగన్‌కు బుద్ధి రాలేదని తెలిపారు. పులివెందులలో మెడికల్ కళాశాలను వైసిపి హయాంలో ఎందుకు పూర్తి చేయలేదని, ప్రారంభించలేదని ప్రశ్నించారు. జగన్ రాజకీయాలలో ఉండడం ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని చెప్పారు. సూపర్ సిక్స్‌పై అసత్య ప్రచారాలు, ప్రతిపక్ష హోదా రాదని తెలిసి రాద్ధాంతం చేయడం పరిపాటిగా మారిందని విమర్శించారు.

నేడు యూరియా పంపిణీ

ప్రజాశక్తి - చెన్నూరు : మండలంలోని చెన్నూరుకు చెందిన రైతులకు శుక్రవారం మన గ్రోమోర్‌లో యూరియా పంపిణీ చేస్తామని ఎఒ ఒక ప్రకటనలో తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో రావాలని ఆమె తెలిపారు. 9.9 టన్నులు యూరియా వచ్చిందని అన్నారు. కొండపేట గ్రామానికి రైతు సేవా కేంద్రానికి 19.8 టన్నుల యూరియా అవసరమైన రైతులు తీసుకెళ్లాలని ఆమె తెలిపారు. ఒక ఒక ఎకరం మనకు నూరు కిలోల వరకు వాడవచ్చు. అంతకన్నా ఎక్కువ చీడ పీడ పడుతుందని , అంతకన్నా ఎక్కువ వాడితే ఖర్చు ఎక్కువ అవుతుందని ఆమె తెలిపారు.


ఎరువుల బస్తాలను కేంద్రానికి తరలిస్తున్న కూలీలు

అరియర్స్ బిల్లుల చెల్లింపు గడువు పొడిగించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : అరియర్స్ బిల్లులను ఖజానాకు సమర్పించేందుకు గడువు పొడిగించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. గురువారం జిల్లా ఖజానా కార్యాలయంలో ఉప సంచాలకులు వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ అరియర్ బిల్లులు సమర్పించేందుకు ప్రతి నెలా 6 నుంచి 10 వరకు గడువు ఉండేదని చెప్పారు. ఈనెల కొన్ని అనివార్య కారణాల వల్ల 8 నుంచి 15 వరకు గడువు పొడిగిస్తామని చెప్పినప్పటికీ 10వ తేదీనే ఆన్‌లైన్‌లో గడువు ముగిసినట్లుగా చూపుతున్నారని తెలిపారు. దీనివల్ల ఉపాధ్యాయులు, ఉద్యోగులు అరియర్ బిల్లులు సమర్పించలేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. బిల్లులు సమర్పించేందుకు 15 వరకు గడువును పొడిగించాలని కోరారు. స్పందించిన ఉప సంచాలకులు వెంకటేశ్వర్లు కొన్ని సాంకేతిక కారణాల వల్ల సమస్యలు తలెత్తాయని చెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించి గడువు పొడిగించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతోంది : వైసిపి

ప్రజాశక్తి - కడప : రాష్ట్రంలో అవినీతి రాజ్యం ఏలుతోందని, దేశంలోని అవినీతి చక్రవర్తి చంద్రబాబు నాయుడు అని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్షల కోట్ల రూపాయల అక్రమ ఆస్తులు ఉన్న ఏకైక సిఎం చంద్రబాబు అని ఆరోపించారు. .బ్రిటిష్ పాలన కంటే దారుణమైన పాలన రాష్ట్రంలో సాగుతుంది అన్నారు. ప్రజలకు మేలు జరగాలన్న ఆలోచనతో ప్రతి జిల్లాల్లో మెడికల్ కళాశాలలు నిర్మించారని, పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని మాజీ సిఎం జగన్ గొప్ప ఆలోచన చేశారు అన్నారు. అలాంటి కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరించడం దారుణమని వాపోయారు. రాబోయే రోజుల్లో వైసిపి తరపున పోరాటానికి సిద్ధం అవుతామన్నారు. పేద ప్రజలకు మంచి చేసేందుకు ఎప్పుడూ ముందుంటాం అన్నారు. ప్రయివేటీకరించడం వల్ల పేద విద్యార్థులు వైద్య విద్య చదివేందుకు వీలు ఉండదు అని తెలిపారు. ప్రజలను మభ్య పెట్టడం చంద్రబాబు ఇప్పటికైనా మానుకోవాలని హితవు పలికారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి- కమలాపురంటౌన్ : రెండు రోజుల్లో భూ సమస్యలు పరిష్కారం కావాలని కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్ పేర్కొన్నారు. మండలంలోని పందిళ్ళపల్లెను గురువారం ఆమె సందర్శించారు. గత ప్రభుత్వంలో జగనన్న భూ సర్వేలో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను ఎందుకు పరిష్కారం చేయలేదంటూ మండల రెవెన్యూ అధికారులపై మండిపడ్డారు. పందిళ్ళ పల్లె గ్రామస్తులు పలు మార్లు మండల రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కాక పోవడంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్‌డిఒ క్షేత్రస్థాయిలో పర్యటించారు. భూ సమస్యలు పూర్తయ్యేంతవరకు మండల రెవెన్యూ అధికారులందరూ ఇక్కడే ఉండాలని ఆదేశించారు. కార్యక్ర మంలో తహశీల్దార్ శివరామిరెడ్డి, సర్వేయర్లు, విఆర్‌ఒలు, ఇఆర్‌ఎలు పాల్గొన్నారు.

విద్యారంగానికి రాధిక సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-కాశినాయన


హెచ్‌ఎం రాధికను సన్మానిస్తున్న ఎంఇఒలు, ఉపాధ్యాయులు

పేద విద్యార్థుల చదువు కోసం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రెడ్డి కొట్టాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధిక అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎంఇఒలు మహమ్మద్ షఫీ, నిర్మల అన్నారు. రాధికకు జిల్లా అవార్డు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం జడ్‌పిహెచ్‌ఎస్ హెచ్‌ఎం వాకా చంద్రశేఖర్, పిసి చైర్మన్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువు కోసం రాధిక చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. మహిళలకు చదువు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి తల్లి బిడ్డల చదువుకు కృషి చేయడం చాలా గొప్ప విషయమంటూ కొనియాడారు. తమ పాఠశాల ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల తల్లిదండ్రులంతా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం తనను సన్మానించిన అధికారులకు, ఉపాధ్యాయులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. అదే పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయుడు దేవరాజును, మండల విద్యాశాఖా ధికారులను ఆమె సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికా రులు, రెడ్డికొట్టాల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఖదీర్ బాష, మహేష్, వెంకట సుబ్బయ్య, దేవరాజు, మహబూబ్ బాష, అంగన్వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్

ఉల్లి కొనుగోలు కేంద్రాలను
సద్వినియోగం చేసుకోవాలి
- ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్

ప్రజాశక్తి - కడప

జిల్లాలో మార్క్ ఫెడ్ ద్వారా ఇప్పటికే ప్రారంభమైన మైదుకూరు, కమలాపురం ఉల్లి కొనుగోలు కేంద్రాలను ఆయా ప్రాంత ఉల్లి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రైతుల నుండి ప్రభుత్వం చేపడుతున్న ఉల్లి కొనుగోలు ప్రక్రియపై జిల్లా ఇన్‌ఛార్జి సంబంధిత ఉద్యాన, మార్క్ ఫెడ్ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భం ఆమె మాట్లాడుతూ. క్వింటాల్ ఉల్లి ధర రూ.1200 ప్రకారం ఇ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుల నుండి మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వం ఉల్లి పంటను కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలోని మైదుకూరు, కమలాపురం నియోజకవర్గ కేంద్రాల్లోని మార్కెట్ యార్డుల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉల్లి కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే కొనుగోలు ప్రారంభించామని పేర్కొన్నారు. జిల్లాలోని ఉల్లి రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, నాణ్యతను పరిగణలోకి తీసుకుని ఈ కొనుగోలు ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జేసీ తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ఉల్లిపంట పండించిన ప్రతి రైతు సద్వినియోగం చేసుకునేలా అధికారులు అవగాహన పెంచాలన్నారు.జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర బాబు, జిల్లా మార్క్ ఫెడ్ అధికారి పరిమళ జ్యోతి, మార్కెటింగ్ ఎడి ఆజాద్ వలి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చండి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనంతపురం బహిరంగ సభలో బిగ్గరగా ప్రకటించి ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలపాల్సిందిగా కోరినప్పటికీ ప్రజలు పట్టించుకోలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ స్పష్టం చేశారు. సిఎం చంద్రబాబు స్వయంగా నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు చెప్పండి అంటూ కేకలు వేసినప్పటికీ జనం నుండి ఆశించిన స్థాయిలో మద్దతు లభించలేదని విమర్శించారు. కడపలోని తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం పదే పదే నరేంద్ర మోడీ పేరు ప్రస్తావించి దసరా పండుగకు వస్తువుల ధరలు తగ్గి ప్రజలకు అందుబాటులో వస్తున్నాయని, ఇందుకు నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు చెప్పాలంటూ కోరారు. కానీ బహిరంగ సభ లో పాల్గొన్న ప్రజల నుండి స్పందన పూర్తిగా కరవైందన్నారు. జిఎస్‌టి ప్రస్తావన లేకుండా సిఎం చంద్రబాబు జాగ్రత్త పడుతూ నరేంద్ర మోడీకి మద్దతుగా చప్పట్లు కొడుతూ చేతులెత్తి కృతజ్ఞతలు తెలపాలంటూ బిగ్గరగా కేకలు వేసినప్పటికీ ఫలితం లేకపోయిందని వివరించారు. రాష్ట్రానికి కేంద్రం సాయం చేస్తుందన్న ప్రస్తావనకు కూడా ప్రజలు స్పందించలేదన్నారు. దీంతో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ కలయికతో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజాస్పందన కరవైందని రుజువైందన్నారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తెలుగుదేశం జనసేన భారతీయ జనతా పార్టీకి తగిన గుణపాఠం నేర్పిస్తారని హెచ్చరించారు.

నిజాయితీకి నిలువెత్తు రూపం శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కడప అర్బన్

అదనపు ఎస్.పి శ్రీనివాసరావు వృత్తిలో నిబద్ధత, అంకితభావం, నిజాయితీతో విధులు నిర్వర్తించి జిల్లా పోలీస్ శాఖకు విశిష్ట సేవలందించి ఉద్యోగోన్నతిపై బదిలీపై వెళ్లడం అభినందనీయమని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ కొనియాడారు. ఎఆర్‌డిఎస్‌పిగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల ఉద్యోగోన్నతి పొంది ఎఆర్ అదనపు ఎస్‌పిగా ప్రకాశం జిల్లాకు వెళ్తున్న శ్రీనివాసరావుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం గురువారం నిర్వహించారు. శ్రీనివాసరావును ఎస్‌పి శాలువ కప్పి ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ 7 నెలలలో శ్రీనివాసరావు ఎలాంటి చిన్న రిమార్క్ కూడా లేకుండా జిల్లాలో ఎంతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారన్నారు. పలు కీలక సందర్భాల్లో ఎంతో ప్రొఫెషనల్‌గా వ్యవహరించారని చెప్పారు. సన్మాన గ్రహీత, మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎస్‌పి అశోక్ కుమార్ ప్రోత్సాహం, సహకారం మరువలేనిదని, ఎస్.పికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎఆర్ ఎస్‌పి బి.రమణయ్య సహకారం ఎప్పటికి మరువలేనన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు శివరాముడు, వీరేష్, శ్రీశైల రెడ్డి, టైటస్, సోమశేఖర్, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, స్వామి నాయక్, వర్మ రామస్వామిరాజు, అప్పలనాయుడు, శ్రీనాథ్ పాల్గొన్నారు.


శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎస్.పి, పోలీసు సిబ్బంది



వంకలో నడుస్తున్న నీలాపురం ప్రజలు

ప్రమాదకరంగా నీలాపురం వంక

- తండాకు ఆగిపోయిన రాకపోకలు

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలోని నీలాపురం వంక నిండుగా ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. గురువారం కురిసిన భారీ వర్షానికి వంక ఉధృతంగా ప్రవహిస్తోంది. నీలాపురం, నీలాపురం తండా వాసులకు రాకపోకలు నిలిచిపోయాయి. నీలాపురం రైతులు పొలాలకు వెళ్లాలంటే ఆ వంక దాటుకునే వెళ్లాల్సి ఉంది. వర్షం వచ్చినప్పుడల్లా వంక నిండుగా ప్రవహిస్తుండడంతో అటు నీలాపురం గ్రామ రైతులు, తండావాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంక మీద కల్వర్టు నిర్మాణం, నీలాపురం గ్రామం నుంచి తండా వరకు రోడ్డు నిర్మాణం కోసం ప్రజలు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ నాయకుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా కల్వర్లు, రోడ్డు నిర్మాణం చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. ఇందుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చొరవ చూపాలని వేడుకుంటున్నారు.

హెచ్ఐవి నివారణకు ఎబిసి సూత్రాలు

చాపాడు : హెచ్ఐవి నివారణకు ఎబిసి సూత్రాలు పాటించాలని 104 డాక్టర్ నాగార్జున తెలిపారు. లక్ష్మీపేట హైస్కూల్ విద్యార్థులకు, ప్రజలకు లింకు వర్కర్ స్కీం చైల్డ్ ఫండ్ ఇండియా వారి ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు మానసికంగా బాధ పడుతున్నారన్నారు. ఎయిడ్స్ గురించి తెలుసుకొని ఆరోగ్యంగా జీవించాలని, పెళ్లికి ముందు శృంగారం హెచ్ఐవి/ఎయిడ్స్‌కు శ్రీకారం అన్నారు. ఎయిడ్స్ వ్యాధిని ద్వేషించడి.. వ్యాధి వచ్చిన వారిని ఆదరించండని సూచించారు. ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు చేయి చేయి కలిపి దేశం నుంచి పారదోలాలని పిలుపునిచ్చారు. వైద్య రంగంలో ఎన్ని వ్యాధులు వచ్చినా వాటికి మందులు కనిపెట్టగలిగే టెక్నాలజీ మనకు ఉందన్నారు. హెచ్ఐవి శరీరంలోని వ్యాధి నిరోధక శక్తిని పూర్తిగా దెబ్బ తీస్తుందన్నారు. తద్వారా శరీరం ఇతర వ్యాధులకు సులువుగా గురవుతుందన్నారు. రక్తమార్పిడి, కలుషిత సిరంజీల ద్వారాఎయిడ్స్ వ్యాంి చెందుతుందని వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా ప్రతినిధి దర్బార్ వల్లి, సురేంద్ర, ఎఎన్ఎం కీర్తి దాయని, ఆశా వర్కర్స్ రూపకళ, పద్మావతి, పాల్గొన్నారు.

(పెద్దముడియం) జమ్మలమడుగు రూరల్: విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని మేడిదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాహుల్ పేర్కొన్నారు. గురువారం పెద్దపసుపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శాంతకుమారి, కామ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గౌతమి, ఎఎన్ఎం బుజ్జి, ఆశ కార్యకర్త పుల్లమ్మ, పాఠశాల హెచ్ఎం జరీనా బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. గురువారం నాగయపల్లెలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరంలో కామనూరు పిహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. గ్రామంలో ముందస్తు చర్యగా లార్వా, ఫీవర్ సర్వే నిర్వహించారు. జ్వర లక్షణాలు ఉన్న 8 మందికి మలేరియా, డెంగీ, టైఫాయిడ్ పరీక్షలు నిర్వహించగా అందరికి నెగటివ్ రిపోర్ట్ వచ్చిందని, వైరల్ ఫీవర్స్ అయి ఉండచ్చని శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, నాయకులు వెంకట సుబ్బయ్య, శ్రీను, సీహెచ్ఓ క్రిష్ణమ్మ, సూపర్‌వైజర్ బిఏ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, సీహెచ్ఓ మెర్సీ, గంగాధర్, నరసింహ, ఎఎన్ఎంలు యశోద, రత్నమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, ఆశా కార్యకర్తలు నాగలక్ష్మి, బిందు, స్వర్ణ కల్యాణి, ప్రజలు పాల్గొన్నారు.

పోషకాహారం అవసరం

ప్రొద్దుటూరు : దృష్టిలోప నివారణక పోషకాహారం తీసుకోవడంతోపాటు, ప్రతిరోజూ వ్యాయామం తప్పక చేయాలని ఆప్తల్మిక్ ఆఫీసర్ కేజే రఘురామిరెడ్డి సూచించారు. స్థానిక వైవిఎస్ బాలికోన్నత పాఠశాలలో నాలుగు రోజుల నుంచి స్కూల్ ఐ స్క్రీనింగ్ కార్యక్రమంలో పిల్లలందరికీ ఆయన కంటి పరీక్షలు చేశారు. 106 మందికి దృష్టిలోపం ఉన్నట్లు నిర్ధారించారు. డిఎంహెచ్ఓ నాగరాజు ఆదేశానుసారం డిస్టిక్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మాధవిలత ఆధ్వర్యంలో ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు శాతం దృష్టిలోపం పట్టణ ప్రాంతాల్లో 8 శాతం ఉంటుందన్నారు. కానీ ఈ పాఠశాలలో 12 శాతం కంటే ఎక్కువ దృష్టిలోపం ఉందని తెలిపారు. వివిఎస్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభారాణి, ఏఎన్ఎం శిల్ప, ఆశా వర్కర్ తులసి, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడిగాండ్లపల్లెలో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందం

ముద్దనూరు : కోడిగాండ్లపల్లెలో విష జ్వరాలు విజృంభించి ప్రజలు, పిల్లలు బాధపడుతున్న నేపథ్యంలో గురువారం రిమ్స్ వైద్య కళాశాల నుండి ర్యాపిడ్ బృందం పర్యటించింది. ప్రిన్సిపల్ డాక్టర్ జమున, అసిస్టెంట్ ప్రొఫసర్లు డాక్టర్ సురేష్‌రెడ్డి, డాక్టర్లు నవాజ్, ఖలీఫ్, కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాన్ని పరిశీలించారు. ప్రతి ఇంటిని సందర్శించి గతంలో వచ్చిన జ్వరం కేసులను పరీక్షించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రజలకు పలు సూచనలు చేశారు. గ్రామంలో జ్వరాలు తగ్గే వరకు వైద్య శిబిరం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాధాకృష్ణవేణి, డాక్టర్ శ్రీకాంత్, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ యాదవ్, లక్ష్మయ్య, రామారావు, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌వి తైక్వాండో అకాడమీలో బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌వి తైక్వాండో అకాడమీలో 12 మంది విద్యార్థులు బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్ సాధించారని అకాడమీ కరస్పాండెంట్ [illegible] హరి నారాయణ తెలిపారు. ఈ విభాగంలో కే జీవన, కె భరద్వాజ్, వి శివశంకర్‌రెడ్డి, ఎం హరికృష్ణరెడ్డి, ఎం నీరజ, ఎం చాతుర్య, ఆర్ తేజస్విని, పి మునిసరిత, ఈ ధరణి, [illegible], నారాయణమూర్తి, సూర్యనారాయణ బ్లాక్ బెల్ట్ సాధించారన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని మాస్టర్ శ్రీనివాసులు దగ్గరుండి పర్యవేక్షిస్తూ నైపుణ్యాలను నేర్పిస్తున్నారన్నారు. కో-ఆర్డినేటర్ గౌరీ శంకర్ మాట్లాడుతూ స్పోర్ట్స్ కోటాలో రిజర్వేషన్ కూడా ఉంటుందన్నారు. కళాశాలలో చదివే విద్యార్థులు కూడా యూనివర్సిటీ టోర్నమెంట్‌లో మెడల్ సాధించడమే తమ లక్ష్యమన్నారు. కళాశాల డైరెక్టర్ పృథ్వీ నారాయణ, కడప శ్రీహరి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి విద్యార్థులకు బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లను అందజేశారు.

అమ్మాలన్నా.. కన్నీరు తెప్పిస్తున్న ఉల్లి ధరలు

కోతకు కూలీల డబ్బు కూడా రాదని.. అలానే పొలంలో వదిలేయాలనే ఆలోచనలో రైతులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ఉల్లి ధరలు వారికి కన్నీటిని తెప్పిస్తున్నాయి. పంట చేతికందే సమయానికి ధరలు పతనం మవడంతో రైతులు దిక్కు తోచనిస్థితిలో ఉన్నారు. క్వింటా రూ.500 ధర పలికినా కనీసం కూలి కూడా రావని, చేసిన అప్పులు తీర్చే దారిలేదని వాపో తున్నారు. పొలంలోనే అలాగే వదిలేసే మేలనే పరిస్థితికి రైతులు వస్తున్నారు. కనీసం పంట కోసే ఖర్చులు అయినా మీద పడకుండా ఉంటాయని ఆవేదన చెందుతున్నారు. పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా వేంపల్లె మండలంలో దాదాపు 360 ఎకరాలలో, వేముల మండలంలో 635, తొండూరు మండలంలో 285, పులివెందుల మండలంలో 120 ఎకరాల్లో రైతులు ఉల్లి పంటను సాగు చేశారు. గతంలో క్వింటా రూ.1,500 నుంచి రూ.1,800 వరకు ధర పలికేది. ప్రస్తుతం క్వింటా రూ.700, రూ.500 మాత్రమే ధర పలుకుతోందని కన్నీరు పెట్టుకుంటున్నారు. ఇలాగే ఉల్లి ధర పతనమైతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉల్లి ఎకరా సాగుకు రూ.లక్షపైన పెట్టుబడి అవుతుందని రైతులు తెలిపారు. పెట్టుబడి దేవుడెరుగు.. పంట కోస్తే కనీసం కూలి డబ్బులు కూడా వస్తాయో రావో అని అల్లాడిపోతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఉల్లి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తే మేలు జరుగుతుందని సూచిస్తున్నారు. లేదంటే ఆత్మహత్యలే శరణ్యమని వారు పేర్కొంటున్నారు.



మార్కెట్లో ఉంచిన ఎర్రగడ్డలు

మద్దతు ధర వచ్చేలా చొరవ చూపాలి

ప్రభుత్వం ఉల్లి సాగు చేసిన రైతులకు మద్దతు ధర వచ్చేలా చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు. మూడెకరాల్లో ఉల్లి సాగు చేశానని, ప్రస్తుతం [illegible] పెట్టుబడిపోనూ డబ్బులు మిగులుతాయి.. అప్పులు తీరుతాయిలే అనుకున్నానని.. పంట చేతికందే సమయానికి ధరలు పడిపోయాయని ఆవేదన వెలుబుచ్చాడు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని ఆ రైతు కోరుతున్నాడు.

పరిహారంలో దళితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్మిస్తున్న జాతీయ 440 రహదారిలో ఇంటి స్థలాలు కోల్పోయే దళితులకు నష్ట పరిహారంలో న్యాయం చేయాలని దళిత మహిళలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద దళిత మహిళలు జాతీయ రహదారిలో ఇంటి స్థలాలు కోల్పోయే బాధితులకు పరిహరం అందజేయాలని ధర్నా నిర్వహించారు. కబ్జాదారుల నుంచి కాపాడి రహదారి పనుల్లో ఇంటి స్థలాలు కోల్పోయే దళితులకు నష్టపరిహారం మంజూరయ్యేలా చూడాలని తహశీల్దార్ హరినాథ్‌రెడ్డికి వినతిపత్రమిచ్చారు. స్థానికంగా ఆయా ప్రాంతాల్లో ఉన్న దళితులు వేంపల్లె గ్రామ పొలంలోని 164, 165 సర్వే నెంబర్లలో 92 మందికి ఒకొక్కరికి 5 సెంట్లు ప్రకారం ఇంటి స్థలం కలిగి ఉన్నట్లు తహశీల్దార్ దృష్టికి తెచ్చారు. 1997లో ప్రభుత్వానికి చలానా కట్టి ఆ భూమిని ప్లాట్లుగా విభజించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నామన్నారు. ఇందులో కొంతమంది ఇళ్లను నిర్మించుకున్నారని తెలిపారు. తమ స్థలాన్ని కజ్జా చేసేందుకు గౌసియా, అమీరున్‌కు చెందిన అనుచరులు ప్రయత్నిస్తుండడంతోపాటు జాతీయ రహదారి ద్వారా వచ్చే నష్ట పరిహారం రాకుండా చేస్తేందుకు చూస్తున్నట్లు ఆరోపించారు. ఎలాంటి సంబంధంలేని వ్యక్తుల పేర్లు నష్టపరిహారంలో ప్రకటించారన్నారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ జాతీయ రహదారిలో ఇంటి స్థలాలు, భూములు కోల్పోయే వారి డ్యాకుమెంట్లును జెసికి పంపామన్నారు. ప్రస్తుతం భూములు కోల్పోయే వారికి మాత్రమే నష్ట పరిహారం లబ్దిదారుల బ్యాంక్ ఖాతాలో పడుతున్నట్లు చెప్పారు. ఇంటి స్థలాలు కోల్పోయే వారికి ఇంకా పరిహారం పడలేదని చెప్పారు. డ్యాకుమెంట్ ఇచ్చిన వారందరికి పరిహారం వస్తుందని ఏవరూ అపోహ పడవద్దని తహశీల్దార్ పేర్కొన్నారు. పడనివారు జెసిని కలువవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ రామాంజనమ్మ, మాజీ ఎంపిటిసి నాగన్న, పుల్లయ్య, బాధిత మహిళలు పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత మహిళలు

జాతీయ స్థాయి పరీక్షల్లో విద్యార్థులు రాణించాలి

ప్రజాశక్తి - వేంపల్లె :జాతీయస్థాయిలో జరిగే పరీక్షల్లో ట్రిపుల్ఐటి విద్యార్థులు రాణించాలని ట్రిపుల్ టి డైరెక్టర్ కుమార స్వామి గుప్తా తెలిపారు. గురువారం ఫిజిక్స్ వాలా విద్యా సంస్థ ఆధ్వర్యంలో ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ఐటి క్యాంపస్‌లో ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు జాతీయ స్థాయిలో నిర్వహించే గేట్, క్యాట్, జీమ్యాట్ ఇంజినీరింగ్ సర్వీస్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన భవిష్యత్తు కోసం ప్రత్యేకదృష్టి పెట్టాలని కోరారు. ఇలాంటి అవగాహన సదస్సులో అధ్యాపకుల సూచనలను మనసులో పెట్టుకోవాలన్నారు. పోటీ పరీక్షల విభాగపు అధికారి కోనప్ప ఆధ్వర్యంలో కెరియర్ డెవలప్‌మెంట్ సహకారంతో ఫిజిక్స్ వాలా విద్యా సంస్థ విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం ఫిజిక్స్ వాలా విద్యా సంస్థ అధ్యాపకులు రషీద్, రతన్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వివరణాత్మక ప్రదర్శన చేశారు. ఉపాధి అవకాశాలు పొందే ప్రధాన మార్గాలను కూడా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ట్రిపుల్ఐటి అకడమిక్ డీన్ రమేష్ కైలాస్ దండుకర్, సుందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేపాల్ నుంచి స్వస్థలాలకు తెలుగు ప్రజలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : మంత్రి నారా లోకేష్ కృషితో నేపాల్ నుంచి స్వస్థలాలకు తెలుగు ప్రజల వస్తున్నారని జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నేపాల్‌లో జరుగుతున్న మారణోమంలో తెలుగు వారు ఉన్నారని తెలియగానే మంత్రి లోకేష్ అనంతపురం పర్యటనను రద్దు చేసుకుని, ఉదయాన్నే హుటాహుటిన సచివాలయానికి చేరుకున్నారన్నారు. రియల్ టైం గవర్నెన్స్ సెంటర్ వార్ రూమ్‌ను కమాండ్ కంట్రోల్ రూమ్‌గా మార్చి సహాయక చర్యలను వేగవంతం చేశారన్నారు. బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారన్నారు. ఎక్కడెక్కడ ఉన్నారో లొకేషన్ కో-ఆర్డినేట్లతో సహా మ్యాప్ సిద్ధం చేయించారని తెలిపారు. ఢిల్లీలోని ఏపీ భవన్లో అత్యవసర హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం, చిక్కుకుపోయిన ప్రజలకు ఆహారం, నీరు, వసతి సదుపాయాలు కల్పించేలా చూశారన్నారు. ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను లోకేష్ చాటి చెప్పారన్నారు. కేంద్రం అండతో సమన్వంతో ఈ ఆపదలో ఉన్న ఒక్కొక్కరినీ సురక్షితంగా రక్షించడానికి లోకేష్ ముందుకు కదిలారన్నారు. నేపాల్లో తెలుగువారు చిక్కుకుంటే జగన్‌రెడ్డి నుంచి కనీస స్పందన లేదన్నారు. మానవతా దృక్పథంతో కూడా వ్యవహరించలేదన్నారు. కార్యక్రమంలో బాలనాగిరెడ్డి, పుల్లారెడ్డి, శ్రీనివాసులురెడ్డి,పాల్గొన్నారు.

వేపరాలలో జ్యోతుల మహోత్సవం

మైలవరం మండలం వేపరాల గ్రామంలో గురువారం తెల్లవారు జామున చౌడేశ్వరికి జ్యోతుల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి భూపేష్ సుబ్బరామిరెడ్డి హాజరయ్యారు. జ్యోతుల సందర్భంగా చౌడమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జ్యోతులను ఎత్తుకున్నారు. అనంతరం నాయకులు భాస్కర్, కుమార్ ఏర్పాటు చేసిన విందులో ఆయన పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - చాపాడు :మాల్కంబీ రాష్ట్రస్థాయి పోటీలకు నరహరిపురం పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కె.లక్ష్మీ నరసింహ శాస్త్రి తెలి పారు. మైదుకూరు మేధా డిఫెన్స్ అకాడమిలో జిల్లాస్థాయి పోటీలను నిర్వ హించారు. ఎస్‌జీ ఎఫ్ఐ (మాల్కంబీ) క్రీడలలో జిల్లాస్థాయి పోటీల నుండి రాష్ట్ర స్థాయి పోటీ లకు విద్యార్థులు అండర్ -17 విభాగంలో వి.సుబ్బలక్ష్మి (10వ తరగతి), కె.మస్తాన్ వల్లి (9వ తరగతి), అండర్-14 విభాగంలో ఎల్.గంగా సిద్దార్థి (8వ తరగతి) ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు, పీడీ ప్రశాంతి హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు చాపాడు విద్యార్థి

ప్రజాశక్తి - చాపాడు : రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు చాపాడు హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి టీ చంద్రశేఖర్ ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయులు పి.వెంకటలక్ష్మి తెలిపారు. కడపలో జరిగిన జిల్లాస్థాయి పోటీలో చంద్రశేఖర్ 58కిలోల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక య్యాడని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి ఉత్తమ ప్రతిభ చూపడం పట్ల ఉపాధ్యాయులు, పీడీ ఓబయ్య హర్షం వ్యక్తం చేశారు.



చంద్రశేఖర్

ఎమ్మెల్యే 'ఆది' చేసే అభివృద్ధిని ఓర్వలేని పిఆర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎమ్మెల్యే సి.ఆదినారా యణరెడ్డి చేసే అభివృద్ధిని చూసి వైసిపి ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి ఓర్వలేక పోతున్నారని జమ్మలమడుగు మార్కెట్ యార్డ్ చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక రిపబ్లిక్ క్లబ్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్ట ణాలకు, మండల కేంద్రాలకు రోడ్డు నిర్మాణాలు అభివృద్ధి చేయడం, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నగదు పంపిణీ వైసిపినేతలకు మింగుడు పడడం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా రామసుబ్బారెడ్డి ఉండి నియోజకవర్గాన్ని ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, పాల్గొన్నారు.

శిక్షణకు వెళ్లిన ఎఒ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు: ముద్దనూరు మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి చెన్నైలో 5రోజులపాటు జరగనున్న ఎరువుల నియంత్రణ చట్టం, నియమ నిబంధనలపై శిక్షణా కార్యక్రమానికి వెళ్లారు. ఈ విష యాన్ని రైతులు గమనించి సహకరిం చాలని ఆయన కోరారు.

అరుణ ఆస్పత్రి సీజ్

ప్రజాశక్తి - వేంపల్లె : వేంపల్లెలోని జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న అరుణ ప్రయివేటు ఆస్పత్రిని వైద్యాధికారులు సీజ్ చేశారు. గురువారం డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఖాజా మొద్దీన్ తన సిబ్బందితో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా సర్జరీలు జరుగుతున్న విషయం బయట పడింది. దీంతో ఆస్పత్రిని సీజ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతులు లేకుండా అరుణ ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమ తనిఖీలో సర్జరీలు కూడ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ప్రయివేట్ ఆస్పత్రులకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈయన వెంట సినియర్ అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రమిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ అన్యాయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రయివేటీకరించడం అన్యాయమని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి, పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆ మేరకు గురువారం పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద కాంగ్రెస్ శ్రేణులు నల్ల జెండాలు, నల్ల రిబ్బన్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు కళాశాల సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైద్య విద్య ప్రయివేటీకరణ టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్‌కు పూర్తి వ్యతిరేకమన్నారు. పులివెందుల వైద్య కళాశాలను ప్రయివేటీకరిస్తూ జారీ చేసిన జిఒ 590ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో పులివెందుల కాంగ్రెస్ నాయకులు బోనాల ఖాదర్, కల్యాణ్ రెడ్డి, నాగరాజు, చంద్రబాబు, వేంపల్లి మండల అధ్యక్షులు బీగాల రామకృష్ణ, చక్రాయపేట మండల అధ్యక్షులు రామాంజనేయులురెడ్డి, వేమయ్య, వేమ నాగరాజ, నరేంద్ర, బద్రీనాథ్, రాఘవయ్య, రవీంద్రనాథ్ రెడ్డి, ఉత్తన్న, అమర్, వినయ్, ఆదిల్, నాని, శివ, నాగరాజు పాల్గొన్నారు.

జమ్మూకశ్మీర్ రాష్ట్ర కన్వీనర్ అరెస్టు సిగ్గు చేటు

వేంపల్లె : ఆప్ పార్టీకి చెందిన జమ్మూకశ్మీర్‌లోని డోడా ఎమ్మెల్యే, రాష్ట్ర కన్వీనర్ నైనా మెహరాజుద్దీన్ మాలిక్‌ను పోలీసులు అరెస్టు చేయడం సిగ్గు చేటని ఆప్ జిల్లా కో-ఆర్డినేటర్ రహమతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్ పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నార. ఒక ఎమ్మెల్యేపై పీడీ యాక్ట్, ఉగ్రవాద, సంఘ విద్రోహ వంటి కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అలాంటి వ్యక్తులపై బిజెపి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ప్రజలకు అందుబాటులో ఆసుపత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడం వల్లనే అప్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేను పోలీసులు అదుపులోకి తీసుకోవడం సరైంది కాద న్నారు. ప్రజల ఆగ్రహాన్ని చూడకముందే అప్ ఎమ్మెల్యేను పోలీసులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వేంపల్లె మండల అప్ సభ్యులు షఫీ, సమీర్, ఖదీర్, బాబ్జి పాల్గొన్నారు.

వేముల ఎంపిడిఒగా గంగాదేవి

వేముల : వేముల ఎంపిడిఒగా గంగాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో చెన్నూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒగా విధులు నిర్వర్తించేవారు. ప్రమోషన్ మీద వేముల ఎంపిడిఒగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని తెలిపారు. కార్యాలయ సిబ్బంది ఎంపిడిఒకు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు.



మోతాదుకు మించి ఎరువులు, మందులు వాడరాదు

సింహాద్రిపురం : పండ్ల తోటల్లో రైతులు గడ్డి మందు పిచికారి చేయడం అనర్థదాయకమని ముద్దనూరు ఉద్యానవన శాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పైడిపాలెం గ్రామంలో గురువారం చీనీ, అరటి, ఉల్లి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడ్డి మందులను పిచికారీ చేయాలని వ్యవసాయాధికారులెవరూ సూచించడం లేదన్నారు. కొంతమంది డీలర్లు కొన్ని ప్రాంతాల్లో నిషేధించిన గడ్డి మందులు అనధికారికంగా విక్రయిస్తుండడంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు.